## బాధిత కుటుంబానికి మాజీ విప్ పరామర్శ



దర్శనాల రమేశ్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే సుమన్

భీమారం, ఏప్రిల్ 7 : మండలంలోని పొలంపల్లి గ్రామ మాజీ సర్పంచ్ దర్శనాల రమేశ్ తండ్రి రాజయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, వారి కుటుంబ సభ్యులను మాజీ విప్, చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే సుమన్ ఆదివారం పరామర్శించారు. ఆ కుటుంబానికి సానుభూతి తెలిపారు. ఆయన వెంట బీఆర్ఎస్ జిల్లా నాయకుడు రాజా రమేశ్, మండల అధ్యక్షుడు కలగూర రాజ్‌కుమార్, నాయకులు దాసరి మధునయ్య, గుడిమల్ల వెంకటిమేస్త్రీ, వడ్లకొండ కిష్టయ్య, జలంపల్లి సమ్మయ్య, భూక్య రాజు నాయక్ ఉన్నారు.

## మార్గనిర్దేశకులు కవులు



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాహుల్

మంచిర్యాల ఏసీసీ, ఏప్రిల్ 7 : సమాజ మార్గ నిర్దేశకులు కవులని మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ బీ.రాహుల్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో మంచిర్యాల జిల్లా సాహితీ సంరక్షణ సమితి ఆధ్వర్యంలో సంస్థ అధ్యక్షుడు దండనాయకుల వామన్‌రావు అధ్యక్షతన కవయిత్రి అడ్డగూరి శ్రీలక్ష్మి అంతస్మితం గేయ సంపుటిని డాక్టర్ మారేపల్లి వెంకటరమణ పట్వర్ధన్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. సంస్థ ప్రధాన కార్యదర్శి అల్లాడి శ్రీనివాస్, బోనగిరి రాజరాడ్డి, తోకల రాజేశం, డాక్టర్ దాసరి శ్రీనాథ్ గౌడ్, కృతి కర్త అడ్డగూరి శ్రీలక్ష్మి, గంగాధర్, పెద్ది భరత్ పాల్గొన్నారు.

# వేతన వ్యథ..!

## మిషన్ భగీరథ సిబ్బందికి అందని జీతాలు

- ఐదు నెలలుగా అవస్థలు
- సర్కారు స్పందించాలని వేడుకోలు



మిషన్ భగీరథ పైపులైన్‌కు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

కుమ్రం భీం ఆసిఫాబాద్, ఏప్రిల్ 7 (నమస్తే తెలంగాణ) : పల్లెలకు నిత్యం నీటిని సరఫరా చేసే మిషన్ భగీరథ సిబ్బంది ఐదు నెలలుగా వేతనాలు అందక అష్టకష్టాలు పడుతున్నది. జిల్లాలోని 15 మండలాలతోపాటు ఆదిలాబాద్ జిల్లాలోని ఐదు మండలాలు, మంచిర్యాల జిల్లాలోని బెల్లంపల్లి పరిధిలోని మూడు మండలాలకు ఆసిఫాబాద్‌లోని కుమ్రం భీం ప్రాజెక్టు నుంచే మిషన్ భగీరథ నీరు సరఫరా అవుతున్నది. వాల్ ఆపరేటర్లు, ఫిట్టర్లు, సూపర్‌వైజర్లు ఇలా సుమారు 600 మంది సిబ్బంది నిత్యం క్షేత్రస్థాయిలో పనిచేస్తున్నారు. ఉదయమే వెళ్లి గ్రామాలవారీగా నీటిని విడుదల చేయడంతోపాటు ఎక్కడ ఎలాంటి సమస్య తలెత్తినా వెంటనే పరిష్కరిస్తుంటారు. వీరికి రూ. 10 వేల నుంచి రూ. 12 వేల వరకు వేతనాలుంటాయి. ఐదు నెలలుగా వీరికి వేతనాలు రాకపోవడంతో కుటుంబ పోషణకు అష్టకష్టాలు పడుతున్నారు.

### కేసీఆర్ హయాంలో సకాలంలో వేతనాలు

కేసీఆర్ ప్రభుత్వంలో ప్రతినెలా క్రమం తప్పకుండా వేతనాలు అందేవి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందో లేదో.. సిబ్బందికి వేతన కష్టాలు మొదలయ్యాయి. పైగా మిషన్ భగీరథ నీటి సరఫరాలో సమస్యలు తలెత్తుతున్నాయి. అసలే వేసవి.. తాగు నీరు సరఫరాలో అంతరాయం కలుగుతుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి సకాలంలో వేతనాలు అందించాలని మిషన్ భగీరథ సిబ్బంది కోరుతుండగా, సక్రమంగా తాగు నీరు సరఫరా చేయాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

### ఐదు నెలలుగా జీతాలిస్తలేరు..



నిత్యం గ్రామాల్లో తిరుగుతూ తాగు నీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా చూసుకుంటం. సమస్య వస్తే రాత్రీపగలూ తేడా లేకుంట పనిచేస్తం. ప్రతి రోజూ 20 నుంచి 30 కిలో మీటర్లు తిరగాల్సి వస్తుంది. ఐదు నెలలుగా జీతాలు రావడం లేదు. ఆర్థికంగా ఇబ్బందులు పడాల్సి వస్తుంది. సర్కారు మా గోస తీర్చాలి.

**- చాపిడి బాలేశ్, వాల్ ఆపరేటర్, ఆసిఫాబాద్**

### ప్రభుత్వం స్పందించాలి..



కుమ్రం భీం ప్రాజెక్టు నుంచి మిషన్ భగీరథ నీరు సరఫరా అయ్యే గ్రామాల పరిధిలో దాదాపు 600 మంది సిబ్బంది పనిచేస్తున్నాం. అసలే తక్కువ వేతనం. అదీ కూడా సమయానికి అందించకుంటే ఎలా..? తీవ్ర ఇబ్బందులు పడుతున్నం. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి, జీతాలు త్వరగా చెల్లించాలి.

**- మాచరాల బుద్ధయ్య, ఆపరేటర్, కెరమెరి**

# కొక్కొరోకో..

- కిలో చికెన్ ధర రూ.300
- ఎండలకు తగ్గుతున్న కోళ్ల ఉత్పత్తి
- వరుస శుభకార్యాలు, పండుగలూ కారణం



సోన్, ఏప్రిల్ 7 : చికెన్ ధరలు రిటైల్ మార్కెట్‌లో ఆకాశన్నంటాయి. ఎండల తీవ్రత పెరుగుతుండడంతో కోళ్ల ఉత్పత్తి తగ్గింది. దీనికితోడు వరుస పండుగలు, పెండ్లిళ్లు, శుభకార్యాలు ఉండడం, మొక్కజొన్న, జొన్న, బియ్యం వంటి దాణా ఖర్చులు కూడా పెరగడం, డిమాండ్‌కు సరిపడా ఉత్పత్తి లేకపోవడంతో ధరలు అమాంతం పెరిగాయి. నిర్మల్ జిల్లా కేంద్రంతోపాటు సోన్, నిర్మల్ రూరల్ మండలాల్లోని రిటైల్ షాపుల్లో ఆదివారం చికెన్ ధర రూ.300 దాటింది. మూడు నెలల క్రితం రూ.140 ఉన్న ధర ఒక్కసారిగా పెరగడంతో వినియోగదారులు చికెన్ కొనడానికి జంకుతున్నారు.

## ఎండిన వరి పైరు..

దస్తురాబాద్, ఏప్రిల్ 7 : భూగర్భజలాలు అడుగంటడంతో బావులు, బోర్లలో నీరు ఇంకిపోతున్నది. చేతికందే దశలో ఉన్న వరి పంటను కాపాడుకునేందుకు నానా తంటాలు పడుతున్నారు. అప్పులు చేసి కొత్తగా బోర్లు వేస్తున్న, వ్యవసాయ బావుల్లో పూడికతీత తీసిన లాభం లేకుండా పోతున్నది. కొద్ది రోజుల్లో చేతికొస్తుందనుకున్న దశలో నీళ్లు సరిపోక పంటలు ఎండిపోతున్నాయి. కంటికి రెప్పలా కాపాడుకున్న పైరు కళ్ల ముందే ఎండిపోతున్న అన్నదాతలు ఏమి చేయలేక పోతున్నారు. ఇందుకు సాక్ష్యం మండలంలోని పెర్కపల్లె గ్రామంలో చేతికొచ్చి వట్టిపోతున్న వరి పంట దృశ్యాలే. ఎండిన పంటను చూసి రైతులు ఆవేదన చెందుతున్నారు. ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.




దస్తురాబాద్ : నీరు లేక ఎండిన వరి పైరు

# చి'వరి'కి తడి లేకపాయే..

## మరో 20 రోజులపాటు నీరందితేనే చేతికి పంట

- సరస్వతీ కెనాల్ ఆయకట్టు కింద 36 వేల ఎకరాలు
- తడి అందకపోతే పెట్టుబడి పోయినట్టే..
- ఆందోళనలో రైతులు



పొట్ట దశలో ఉన్న వరిని చూపుతున్న రైతు

సోన్, ఏప్రిల్ 7 : శ్రీరామ సాగర్ ప్రాజెక్టు(ఎస్సారెస్పీ) నుంచి సరస్వతి కెనాల్ ద్వారా ఆయకట్టుకు నీరు అందుతున్నది. దీని పరిధిలో సోన్, నిర్మల్ రూరల్, లక్ష్మణ చాంద, మామడ, ఖానాపూర్, పెంబి మండలాలు ఉన్నాయి. వీటి పరిధిలో సుమారు 36 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. యాసంగి సీజన్‌లో వరి వేయగా.. ప్రస్తుతం పొట్టదశలో పంటలు ఉన్నాయి. ఈ పంటలకు మూడు రోజుల క్రితం సరస్వతి కెనాల్ ద్వారా నీటిని నిలిపివేశారు. రెండు, మూడు వారాల్లో కోతకు వచ్చే అవకాశం ఉండగా.. ప్రస్తుతం నీటిని నిలిపివేయడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రధానంగా రైతులు మోటార్లు, కాలువల ద్వారా నీటిని సరఫరా చేస్తారు. కాలువల ద్వారా నీరు రాక, భూగర్భ జలాలు అడుగంటి వరి గింజ తాలుగా మారే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. తమ పొలాలు చేతికొస్తాయనుకున్న సమయంలో మళ్లీ నీటి కొరత మొదలైందని రైతులు వాపోతున్నారు. ఈ కెనాల్ ద్వారా నీటిని కొన్నిరోజుల వరకు వదిలితే గింజ గట్టిపడే అవకాశం ఉంటుందంటున్నారు. అసలే ఎండలు మండుతున్న తరుణంలో నీటిని రోజు అందిస్తేనే తడి దిగుతోందని, తడి ఎత్తిపోతే మళ్లీ నీరు ఎండకు పొరకం దిగే అవకాశం ఉండదనంటున్నారు.



నీరు అందక బీటలువారుతున్న పొలం



ఎస్సారెస్పీ నుంచి నీటిని ఆపివేయడంతో నీరు లేక కనిపిస్తున్న సరస్వతీ కెనాల్

### గతానికి భిన్నంగా..

కేసీఆర్ ప్రభుత్వ హయాంలో నీటిని వారబందీ పద్ధతిలో విడుదల చేసేవారు. ఇలా చేయడం వల్ల నీటిని తగినంత వాడుకునే వెసులుబాటు ఉండేది. నీటి పారుదల శాఖ అధికారులు వరుసగా నీటిని విడుదల చేయడంతో అవసరానికి మించి నీటి వినియోగం జరిగింది. దీంతో ప్రాజెక్టు రిజర్వాయర్‌లో నీటిమట్టం గతానికి కంటే తగ్గిపోయింది. దీంతో నీటి కొరత ఏర్పడి ప్రస్తుతం నీటి విడుదలను ఆపివేయడంతో పంట దెబ్బతిననుంది. వారబందీ పద్ధతి అమలు చేసి ఉంటే.. తగినంత నీరు సరిపోయేదని అభిప్రాయం వ్యక్తమవుతున్నది.

### 20 రోజులు నీరు అందించాలి..



సోన్, ఏప్రిల్ 7 : ప్రస్తుతం వరి పొట్ట దశలో ఉంది. సరస్వతి కాలువ ద్వారా రెండెకరాల వరకు వరి వేసిన. పొట్ట దశలో వరి ఉండగా.. నీటిని బంద్ చేశారు. ఇంతకుముందు వారబందీ పద్ధతిలో నీటిని అందించి కోత వచ్చే వరకు అందించేవారు. ఇప్పుడు ముందుగానే నీటిని ఆపివేయడంతో పొట్ట దశలో ఉన్న వరి ఎండిపోయే ప్రమాదం ఉంది. ఇప్పటివరకు ఎకరానికి రూ.25 వేల వరకు ఖర్చు చేశా. ఈ పంటను కాపాడుకోవాలంటే అధికారులు, నాయకులు స్పందించి మరో 20 రోజుల వరకు నీటిని అందించాలి.

**- ప్రవీణ్, రైతు, లోకల్ వెల్మల్.**

### ఉన్నతాధికారుల నిర్ణయం మేరకు నీటిని విడుదల చేస్తాం..



సోన్, ఏప్రిల్ 7 : వరి పొట్ట దశలో ఉన్నమాట వాస్తవమేనని మా దృష్టికి వచ్చింది. అయితే రిజర్వాయర్‌లో తాగునీటి కోసమే నిల్వ ఉంచాం. ఇప్పటికే సరస్వతీ కెనాల్ ద్వారా సాగునీటి విడుదల కోసం విజ్ఞప్తులున్నాయి. వరి సాగు చేసిన రైతులు పంట తుది దశలో ఉందని విన్నవించారు. ఈ క్రమంలో నీటి విడుదలపై రాష్ట్ర ప్రభుత్వం, ఉన్నతాధికారుల నిర్ణయం మేరకు నడుచుకుంటాం. ఆయకట్టు రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

**- జీ శ్రీనివాస్, ఎస్ఈ, ఎస్సారెస్పీ**

# చెక్‌డ్యాంను బాగు చేయండి..


- అడుగంటిన జలాలు.. ఎండుతున్న పంటలు
- వర్షాకాలం పంటకైనా నీరందించాలని రైతుల వేడుకోలు



కొట్టుకుపోయిన చెక్‌డ్యాం సైడ్‌బండ్

పెంబి, ఏప్రిల్ 7 : మండలంలోని మెరునిపరు గ్రామంలో గతేడాది కురిసిన భారీ వర్షాలకు చెక్‌డ్యాం దెబ్బతిన్నది. చెక్‌డ్యాం పక్కన నిర్మించిన సైడ్ బండ్(మట్టి, బండరాళ్లు) వరద ఉధృతికి కొట్టుకుపోయింది. దీంతో నిలువ ఉండాల్సిన వరద నీరు వృథాగా వెళ్లిపోయింది. దీని ఆయకట్టు పరిధిలో దాదాపు 100–200 ఎకరాల్లో పంటలు సాగవుతున్నాయి. ప్రస్తుతం.. యాసంగిలో మొక్కజొన్న, నువ్వు పంట వేశారు. ప్రస్తుతం రైతులు చెక్‌డ్యాంలో నిలిచిన నీటిలో మోటార్లు ఏర్పాటు చేసుకుని సాగు నీరందిస్తున్నారు. మరో వారం రోజుల్లో ఈ నిలిచిన నీరు కూడా అడుగంటే దశలో ఉండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. చేతికొచ్చిన పంటలు ఎండిపోయే ప్రమాదం ఉండడంతో రైతులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వర్షాకాలం ప్రారంభానికి ముందే చెక్‌డ్యాంకు మరమ్మతు పనులను పూర్తిచేసి, సాగు నీరందించాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.





చెక్‌డ్యాంలో అడుగంటిన నీరు, ఎండిపోతున్న నువ్వు పంట

## బీసీల హక్కుల కోసం ఉద్యమించాలి



నినాదాలు చేస్తున్న బీసీ నాయకులు

మంచిర్యాల అర్బన్, ఏప్రిల్ 7 : బీసీల న్యాయమైన హక్కుల కోసం ఉద్యమించాలని బీసీ సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం మంచిర్యాల ఐబీ చౌరస్తా నుంచి ప్రారంభమైన బీసీ చైతన్య యాత్రనుద్దేశించి వారు మాట్లాడారు. దేశంలో మెజార్టీ వర్గమైన బీసీల న్యాయమైన హక్కుల కోసం రాజకీయ పార్టీలన్నీ తమ వైఖరిని స్పష్టం చేయాలన్నారు. బీసీలు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న బీసీ జనగణను జాతీయ స్థాయిలో చేపట్టాలని డిమాండ్ చేశారు. బీసీల సమస్యలు పరిష్కరించాలని నినాదాలు చేశారు. అనంతరం బీసీ చైతన్య యాత్రను సీనియర్ బీసీ ఉద్యమ నాయకురాలు పేరం అలేఖ్య జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బీసీ ఐక్య వేదిక జిల్లా కన్వీనర్ వడ్డెపల్లి మనోహర్, సీనియర్ బీసీ నాయకులు కనుకుంట్ల మల్లయ్య, సామాజిక న్యాయవేదిక కన్వీనర్ రంగు రాజేశం, చంద్రమౌళి, కోటిలింగం, శంకరయ్య, రాజన్న, సోమయ్య, భూమయ్య, మల్లేశ్, గణేశ్, వెంకటేశ్, అఖిల్, రాజు, నటేశ్వర్, అంజయ్య, రాజు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## పార్లమెంట్ ఎన్నికలకు సహకరించాలి

- నియమావళిని ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు
- ఆసిఫాబాద్ డీఎస్పీ సదయ్య
- ఝరి, మోడీ గ్రామాల్లో కేంద్ర బలగాలతో కవాతు



ఎన్నికల నియమావళిపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ సదయ్య

కెరమెరి, ఏప్రిల్ 7 : పార్లమెంట్ ఎన్నికలు శాంతియుత వాతావరణంలో జరిగేలా ప్రతిపౌరుడు సహకరించాలని ఆసిఫాబాద్ డీఎస్పీ సదయ్య కోరారు. ఆదివారం మండలంలోని ఝరి, మోడీ గ్రామాల్లో ఎస్పీ సురేశ్‌కుమార్ ఆదేశాల మేరకు సీఆర్పీడీవైఎస్పీ రాకేశ్, వాంకిడి సీఐ శ్రీనివాస్, ఎస్ఐ విజయ్ ఆధ్వర్యంలో కేంద్ర బలగాలతో కలిసి కవాతు నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నప్పుడు ప్రతి ఒక్కరూ నియమ నిబంధనాలు పాటించాలని సూచించారు. కుల మతాలకు అతీతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించాలని, ఎవరైనా కోడ్ ఉల్లంఘనకు పాల్పడితే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. 18 ఏళ్లు నిండిన యువతకు ఓటు హక్కు లేకుంటే ఈ నెల 15వ తేదీలోగా తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఎన్నికలకు 48 గంటల ముందు ప్రచారం ముగుస్తుందని, ఎవరైనా డబ్బు, మద్యం పంపిణీ చేస్తే శిక్ష తప్పదని హెచ్చరించారు. సంఘ విద్రోహ శక్తులకు ఎట్టిపరిస్థితుల్లో సహకరించవద్దని, అనుమానాస్పద వ్యక్తులు కనబడితే వెంటనే 100 నంబర్ ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని సూచించారు.

## వడదెబ్బతో ఒకరు మృతి



పోశెట్టి(ఫైల్)

భైంసా, ఏప్రిల్ 7 : నిర్మల్ జిల్లా భైంసా పట్టణంలోని కోర్బగల్లికి చెందిన చిన్న పోశెట్టి (52) శనివారం రాత్రి వడదెబ్బతో మృతి చెందాడు. పోశెట్టి భైంసాలోని గాంధీ గంజ్‌లో హమాలీగా పనిచేస్తున్నాడు. నాలుగైదు రోజులుగా చుట్టు పక్కల గ్రామాల్లో మొక్కజొన్న తూకాలు వేసేందుకు వెళ్లాడు. దీంతో వడదెబ్బకు గురయ్యాడు. శనివారం సాయంత్రం నీరసంగా ఇంటికి వస్తుండగా మార్కెట్‌లో కింద పడిపోయాడు. దీంతో స్థానికులు గమనించి ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడికి భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు.

## ప్రశాంతంగా 'మోడల్' ప్రవేశ పరీక్ష

మంచిర్యాల అర్బన్, ఏప్రిల్ 7 : జిల్లాలోని ఐదు మోడల్ స్కూళ్లలో ప్రవేశానికి, ఏడు నుంచి పదో తరగతి వరకు మిగులు సీట్ల భర్తీకి ఆదివారం ఉదయం, మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జిల్లాలోని పది కేంద్రాల్లో ఆరో తరగతిలో ప్రవేశానికి నిర్వహించిన పరీక్షకు 1,358 మంది విద్యార్థులకుగాను 1,135 మంది విద్యార్థులు హాజరైనట్లు డీఈవో యాదయ్య తెలిపారు. ఏడు నుంచి పదో తరగతి వరకు మిగులు సీట్ల భర్తీకోసం తొమ్మిది కేంద్రాల్లో మధ్యాహ్నం రెండు నుంచి నాలుగు గంటల వరకు పరీక్ష నిర్వహించగా, 2513 మంది విద్యార్థులకుగాను, 2084 మంది పరీక్ష రాసినట్లు పేర్కొన్నారు.

### ఆసిఫాబాద్‌లో..

ఆసిఫాబాద్ టౌన్, ఏప్రిల్7 : జిల్లాలో ఆరో తరగతి ప్రవేశం కోసం ఐదు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయగా, 733 విద్యార్థులకుగాను 692 విద్యార్థులు హాజరయ్యారు. ఏడు నుంచి పదో తరగతి వరకు ఖాళీల భర్తీ కోసం నాలుగు కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షలో 1527 మందికిగాను 1347 మంది హాజరయ్యారు.



కోటపల్లి : విద్యార్థులను తనిఖీ చేస్తున్న అధికారులు